క్లుప్తంగా

సంత్ రవిదాస్‌కు ఘన నివాళి



క్రోసూరు: సంత్ రవిదాస్ జయంతి పురస్కరించుకుని క్రోసూరు చర్మకారుల సేవాసంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రాం విగ్రహాల సెంటర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చర్మకార సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గార్లపాటి దాసు, కంభంపాటి నాగయ్య, కిన్నెర వెంకటేశ్వర్లు, పెద్దింటి డేవిడ్, చిలకా చిన్నా, బోరుగడ్డ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ట



బెల్లంకొండ: స్థానిక శ్రీ గోపయ్య సమేత తిరుపతమ్మ తల్లి ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్టా మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులకు భారీ అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన భక్తుడు నిడమానూరి ప్రసాదరావు ఆలయాన్ని నిర్మించి, విగ్రహాలను ప్రతిష్టించారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నుంచి ఆలయంలో వేద పండితులు ప్రత్యేక పూజలు, హోమాల్ని నిర్వహిస్తున్నారు. విగ్రహ ప్రతిష్ట సందర్భంగా గ్రామంలో సందడి నెలకొంది. వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. ఎంపీపీ చెన్నుపురెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ అహ్మద్ పాషా, కావూరి షేక్ దరియా, నాయకులు సిరిపురం మేస్త్రీ, మౌలాలి, బడాబచ్చా, హైదర్‌వలి తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్ని నిర్వహించారు.

కొయ్యలగూడెం వెళ్లి దివ్యాంగుడికి పింఛన్ పంపిణీ



ఊటుకూరు(క్రోసూరు): మండలంలోని ఊటుకూరుకు చెందిన దివ్యాంగుడు గుడిసె ఏసయ్య ఏలూరు జిల్లా కొయ్యలగూడెంలో ఉంటూ స్వగ్రామానికి రాలేకపోతున్నాడు. వలంటీర్ జెర్రిపోతు రవికిరణ్ ఆదివారం అక్కడకు వెళ్లి పింఛన్ రూ.3 వేలు అందజేయడంతో ఏసయ్య సంతోషాన్ని వ్యక్తం చేశారు. వలంటీర్‌తో పాటు ప్రభుత్వానికి కృతజ్ఞతలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ పశ్చిమ డెల్టా బోర్డు చైర్మన్ గంజిమాల దేవి, కొయ్యలగూడెం ఎంపీపీ గంజిమాల రామారావు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణ వేడుకలు



శావల్యాపురం: మండలంలోని గుర్రంవారిపాలెం, వేల్పూరు, పోట్లూరు గ్రామపంచాయతీ పరిధిలో ఏబీసీ కెనాల్ వద్ద వేంచేసియున్న గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ కల్యాణం వేడుకలు ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో భక్తులు నిర్వహించారు. ఆలయ పూజారి శ్రీనివాసరావు సారథ్యంలో విశేష పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా గోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ అమ్మవారికి ప్రత్యేకంగా పట్టువస్త్రాలు పూలమాలలతో అలంకరణ చేశారు. దేవాలయ ప్రాంగణంలో ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేకంగా అలంకరణ చేసి వేదపండితులు వేదమంత్రాలు భజంత్రీలు నడుమ దంపతులచే కల్యాణ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గోనుగుంట్ల వెంకటరావు, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో భారీ అన్నదానం చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. దేవాలయాన్ని విద్యుత్ కాంతులతో ముస్తాబు చేశారు.

ఓంకారేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

నాదెండ్ల: ఎండుగుంపాలెం గ్రామంలో కొలువైయున్న గంగాపార్వతి సమేత ఓంకారేశ్వరస్వామి దేవాలయ 21 వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్లను ఉదయం ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. గోత్రనామ అభిషేకాలు చేశారు. శాంతిహోమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్వామివార్లకు ఘనంగా కళ్యాణం జరిపి గ్రామోత్సవం నిర్వహించారు.ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రావెళ్ళ సత్యలక్ష్మీ నృసింహ భాస్కరుడు, పాలక మండలి అధ్యక్షుడు కందుల అంకమ్మ, కమిటీ సభ్యులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

నిరు పేదల సొంతింటి కల సాకారం

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



రుద్రవరంలో జగనన్న కాలనీ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: నిరుపేదలందరికీ స్థలాలిచ్చి, ఇంటిని నిర్మించి వారి సొంతింటి కలను సాకారం చేసిన ఘనత సీఎం జగన్‌మోహనరెడ్డిదేనని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పేర్కొన్నారు. మండలంలోని రుద్రవరం జగనన్న కాలనీలో పూర్తయిన 10 ఇళ్లను ఆదివారం ఆయన ప్రారంభించి, గృహ ప్రవేశాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జగనన్న ఇచ్చే ఇల్లు రూ.10లక్షల ఆస్తితో సమానమన్న విషయాన్ని లబ్ధిదారులు గుర్తుంచుకోవాలన్నారు. ప్రత్యేకంగా కాలనీలు ఏర్పాటు చేసి, రోడ్లు, డ్రైనేజ్, మంచినీళ్లు, విద్యుత్ సౌకర్యాలు కల్పించారని చెప్పారు. నివాస యోగ్యమైన స్థలాలు ఇచ్చి అందులో అందమైన ఇల్లు నిర్మించడం అంటే సామాన్యమైన విషయం కాదని తెలిపారు. భవిష్యత్తులో జగనన్న కాలనీల్లో పాఠశాలలు, వైద్యశాలలు, ప్రభుత్వ భవనాలు కూడా నిర్మించనున్నట్లు చెప్పారు. ఇలా గతంలో ఏ ప్రభుత్వంలోనైనా జరిగిందా ? అని ప్రశ్నించారు. కల్లబొల్లి కబుర్లలో మాయమాటలు చెప్పి మోసం చేయడం తమకు చేతకాదని, నిరుపేదల జీవితాలలో వెలుగులు నింపాలన్న లక్ష్యంతో జగనన్న ప్రభుత్వం పని చేస్తోందని వివరించారు. అచ్చంపేట మండలంలో 3500లకు పైగా నిరుపేదలకు స్థలాల ఇవ్వడమే కాకుండా, వారందరికీ ఇళ్ల నిర్మించే బాధ్యత కూడా చేపట్టామని చెప్పారు. పూర్తిస్థాయిలో 500 పైగా ఇళ్లు పూర్తయ్యాయని, మరో రెండు వేలు వివిధ దశల్లో ఉన్నాయని పేర్కొన్నారు. లబ్ధిదారులు వెంటనే ఇళ్లను పూర్తి చేసుకోవాలని, బిల్లుల్ని ఎప్పటికప్పు సకాలంలో ఇప్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, పార్టీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఏఎంసీ మాజీ డైరెక్టర్ సీహెచ్.ఎస్.ఆర్.కె. సాయిరెడ్డి, వ్యవసాయ యూనివర్సిటీ మాజీ డైరెక్టర్ నెల్లూరి చంద్రబాబు, యార్డు మాజీ డైరెక్టర్ అంబటి నారాయణ, ఎంపీటీసీ సభ్యురాలు మేకా మల్లేశ్వరి, ఉప సర్పంచ్ షేక్ జాని, రుద్రవరం వైఎస్సార్‌సీపీ నాయకులు తలతల శివారెడ్డి, ఈమని బ్రహ్మారెడ్డి, అనుమోల సాంబిరెడ్డి, మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

203 మందికి వైద్యపరీక్షలు



వైద్యశిబిరంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి

నకరికల్లు: ఉచిత వైద్యశిబిరాల ద్వారా పల్లెల్లోని ప్రజలకు వైద్యసేవలు అందజేయడం అభినందనీయమని మండల ఉపాధ్యక్షుడు మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని నర్సింగపాడులో నరసరావుపేటలోని జీబీఆర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 203 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి మాట్లాడుతూ పల్లెప్రాంతాల్లోని ప్రజలకు ఉచితసేవలు అందించేందుకు ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా శస్త్రచికిత్సలు తమ వైద్యశాలలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గజ్జల ప్రియాంక, డాక్టర్ సతీష్‌రెడ్డి, డాక్టర్ సుబ్బారెడ్డి, డాక్టర్ శ్రావణి, డాక్టర్ కోటేశ్వరి, కొత్తపల్లి ప్రసాద్, పమ్మి కృష్ణారెడ్డి, షేక్.వలి పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు 57 మంది గైర్హాజర్

సత్తెనపల్లి: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు సత్తెనపల్లి డివిజన్ వ్యాప్తంగా ఆదివారం 57 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం ఎనిమిది పరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా 1,814 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 1,757 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్ష నిర్వహిచినట్లు డీవైఈఓ వి.వెంకటేశ్వరరావు తెలిపారు.

ఆశ్రమంలో లలితా హోమం

కుందురువారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని కుందురువారిపాలెం గ్రామంలోని శ్రీసాందీపని ఆశ్రమంలో లలిత జయంతిని పురస్కరించుకుని ఆదివారం లలితా హోమం నిర్వహించారు. పుష్య మాసం పౌర్ణమి రోజున లలిత జయంతిని జరుపుకుంటారు. వంద సంవత్సరాల కొకమారు ఇలాంటి రోజు వస్తోందని, చాలా అరుదైన రోజు కావటంతో హోమం నిర్వహించినట్లు ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థి అదృశ్యం

నరసరావుపేట టౌన్: విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ అశోక్ ఆదివారం తెలిపారు. మండలంలోని చింతలపాలెం గ్రామానికి చెందిన మారెబోయిన అశోక్ కుమార్ పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. శనివారం ఇంటి నుంచి పాఠశాలకు వచ్చిన బాలుడు తిరిగి ఇంటికి రాలేదు. అతని కోసం గాలించినా ప్రయోజనం దక్కలేదు. ఈ మేరకు బాలుడి తండ్రి హరికృష్ణ ఇచ్చిన ఫిర్యాదుతో అదృశ్యం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

నరసరావుపేట టౌన్: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ టి.సుబ్బారావు ఆదివారం తెలిపారు. నరసరావుపేట రైల్వే స్టేషన్ నుంచి మునమాక రైల్వే స్టేషన్ మార్గమధ్యంలో సుమారు 60 సంవత్సరాలు వయస్సు గల వ్యక్తి పట్టాలు దాటుతుండగా డోన్ నుంచి గుంటూరు వెళుతున్న రైలు ఢీకొంది. సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ క్షతగాత్రుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడు గోధుమ రంగు నిండు చేతుల చొక్కా, తెలుపు రంగు పంచె ధరించి ఉన్నాడు. మృతుడి ఆనవాళ్లు తెలిసిన వారు రైల్వే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

వైభవంగా గంగాదేవి పేరంటాళమ్మ తిరునాళ్ల

- భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు



ఎమ్మెల్యే శంకరరావును శాలువాతో సత్కరిస్తున్న ఆలయ ఈవో రామకోటిరెడ్డి

అచ్చంపేట: మండలంలోని ఓర్వకల్లులో శ్రీగంగాదేవి పేరంటాళమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి రామకోటిరెడ్డి, పూజారులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజారులు అమ్మవారి శేష వస్త్రాలు బహూకరించారు. వేకువ జాము నుంచే భక్తుల అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. ఆలయం ముందు యాదవుల వీరతాడు ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలచింది. తెల్లవారు జాము ఐదు గంటల నుంచి దేవదాయశాఖ కార్య నిర్వహణాధికారి కోటిరెడ్డి పర్యవేక్షణలో పూజలు, అభిషేకాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ముద్రపూలు ఉత్సవాలు, జనివాడ చదరంగం పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనం టికెట్లకు, కొబ్బరికాయల విక్రయాలకు, అమ్మవారికి సమర్పించే చీరె, జాకెట్ ముక్కల విక్రయాలకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తులు అమ్మవారికి తలనీలాలు సమర్పించుకునేందుకు ఆలయం వద్ద ప్రత్యేక స్థలాన్ని కేటాయించారు. అచ్చంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. తహసీల్దారు పద్మారాణి, వీఆర్వోలు, గ్రామ వలంటీర్లు తిరునాళ్ల మహోత్సవాల్ని పర్యవేక్షించారు. వ్యాపారవేత్త మేకా గోవిందరెడ్డి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. అచ్చంపేట ఎస్ఐ కె.పాల్ రవీంద్ర ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

వైభవంగా లక్ష్మీతిరుపతమ్మతల్లి కల్యాణం



లక్ష్మీతిరుపతమ్మ కల్యాణ వేడుక

నకరికల్లు: మండలంలోని చల్లగుండ్ల గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీగోపయ్య సమేత శ్రీలక్ష్మీ తిరుపతమ్మతల్లి కల్యాణవేడుక ఆదివారం కన్నులపండువగా జరిగింది. అమ్మవారి కల్యాణవేడుక పురస్కరించుకుని ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. వేడుకల్లో పాల్గొనేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ కల్యాణవేడుక శాస్త్రోక్తంగా జరిపించారు. పలువురు దంపతులు పీటలపై కూర్చొని వేడుకల్లో పాల్గొన్నారు. భక్తసంఘం ఆధ్వర్యంలో ఆలయం వద్ద చేపట్టిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు వేలాదిగా పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం విశేషంగా అలంకరించిన వాహనంపై ప్రత్యేకంగా అలంకరించిన స్వామివార్ల గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. పురవీధుల్లోకి వచ్చిన అమ్మవారికి మహిళాభక్తులు వార్లుపోసి మొక్కులు చెల్లించారు.


గరుడ వాహన ఊరేగింపు



చాగంటివారిపాలెంలో గరుడవాహన ఊరేగింపు

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీసుభద్ర బలభద్ర సహిత శ్రీజగన్నాథస్వామి 11వ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం గరుడవాహన ఊరేగింపు నిర్వహించారు. ఉదయం సత్తెనపల్లి కి చెందిన గీతాభక్తబృందంచే సామూహిక భగవద్గీత పారాయణం జరిగింది. సాయంత్రం స్వామివారి గరుడవాహన ఊరేగింపు సేవ, గ్రామోత్సవం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో మాఘపౌర్ణమి పూజలు



పట్టణంలో తులసీదళముల అలంకరణలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు



ప్రత్యేక పూజలు చేస్తున్న ఆర్యవైశ్య మహిళ సంఘం, లలితా భక్త సమాజం

సత్తెనపల్లి: పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో లలిత జయంతి, మాఘ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారికి తులసీ దళాలతో విశేషమైన అలంకరణ చేపట్టి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళా సంఘం, లలితా భక్త సమాజం సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా ప్రత్యేక పూజలు చేశారు. 12 గంటల పాటు నిరంతరంగా సప్తాహం, సర్వ మంగళ మాంగల్యే .. అంటూ పారాయణం చేశారు. కల్యాణ మండపంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జవ్వాజి లక్ష్మి, నాళం పార్వతిదేవి, రంగా రమాదేవి, కోట నాగవరలక్ష్మి, చుండురు లక్ష్మీ, తునుగుంట్ల నాగ కన్యాకుమారీ, పెరుమాళ్ళ రాజ్యలక్ష్మీ తోపాటు అనేక మంది మహిళలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం అధ్యక్షుడు శింగరి మధుసూదనరావు, కమిటీ సభ్యులు కార్యక్రమం చేసుకోవడానికి అవకాశం కల్పించినందుకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.అలాగే రైల్వే స్టేషన్ రోడ్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో, వడ్డవల్లి శ్రీరామాలయం, శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చర్చి నిర్వహణకు ఆర్థికసాయం

నాదెండ్ల: మతాలన్నీ మంచినే బోధిస్తాయని, సాటి మనుషులను ఆదుకోవటం, సమాజాభివృద్ధికి దోహదపడటం ఉత్తమ మార్గమని జ్ఞానేశ్వర ఫౌండేషన్ ఛైర్మన్ షేక్ జాన్‌సైదా చెప్పారు. నాదెండ్ల మండలం, చిరుమామిళ్ల గ్రామంలోని కృపా మినిస్ట్రీస్ చర్చి నిర్వహణకు ఫౌండేషన్ తరఫున రూ.15 వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందించారు. మాజీ ఎంపీపీ కంజుల వీరారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు గొంటు శ్రీనివాసరెడ్డి, మానుకొండ శేషిరెడ్డి, రత్నారెడ్డి, షేక్ అబ్దుల్ రౌఫ్, జమ్మలమడక హరిబాబు ఉన్నారు.

చేతిరాతపై ఉపాధ్యాయులకు శిక్షణ



రామ్మోహనరావును సన్మానిస్తున్న ట్రస్ట్ సభ్యులు, ఉపాధ్యాయులు

వినుకొండ(నూజెండ్ల): బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అందమైన చేతిరాత ఒక్కరోజులో అనే కార్యక్రమాన్ని స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వి.రామ్మోహనరావు ఉపాధ్యాయులకు చేతిరాత నైపుణ్యం పెంపొందించుకునేందుకు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు, పిల్లలు ఎక్కువగా రాయటం అలవాటు చేసుకుంటే చేతిరాతలో మరింత నైపుణ్యం పెరుగుతుందన్నారు. మొత్తం 70మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. అనంతరం రామ్మోహనరావును ఘనంగా సత్కరించారు. ట్రస్ట్ అధ్యక్షుడు బీవీ నాగేశ్వరరావు, కౌన్సిలర్ ఎంఎస్‌కే బాషా, గంగవరపు వెంకాయమ్మ, సీహెచ్ రమేష్, ఎస్‌కే సుభాని, పి.నాయక్ పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

నరసరావుపేట ఈస్ట్: ఉన్నత చదువుల నిమిత్తం బొల్లు రాజేశ్వరి కృష్ణారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.25వేలు ఆర్థిక సాయం ఆదివారం అందించారు. పట్టణానికి చెందిన ఎంవీఎస్ లలిత హరియాణాలో ఉన్నత చదువులు నిమిత్తం ఉన్నారు. ఆమె తండ్రి ఎంవీఎస్ రంగనాథ్‌కు ట్రస్ట్ చైర్మన్ బొల్లు వెంకటకృష్ణారావు, సభ్యులు బొల్లువెంకటేశ్వర్లు, జాస్తిగోపాలకృష్ణ ఆర్థికసాయం అందించారు.

చర్చి నిర్మాణానికి సహకారం అందిస్తాం



చర్చి పునః నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

రాజుపాలెం: మండలంలోని దేవరంపాడులో లూథరన్ చర్చి పునః నిర్మాణానికి రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు ఆదివారం శంకుస్థాపన చేశారు. ముందుగా పాస్టర్ ప్రార్థన నిర్వహించారు. రాష్ట్ర మంత్రి అంబటి నవధాన్యాలు వేసి కొబ్బరికాయ కొట్టారు. వందేళ్ల క్రితం ఆ స్థలంలో మిద్దె రూపంలో చర్చిని నిర్మించారు. ఆది శిథిలావస్థకు చేరడంతో గ్రామస్తుల సహాయ సహకారాలతో నూతన చర్చి నిర్మిచుకునేందుకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర మంత్రి అంబటి మాట్లాడుతూ చర్చి నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఆయన వెంట మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, దేవరంపాడు దేవస్థానం కమిటీ చైర్మన్ అంబటి బ్రహ్మయ్య, సర్పంచ్ పత్తిపాటి దీనమ్మకోటేశ్వరరావు, రాజుపాలెం సర్పంచ్ పులిబండ్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక, కర్షక ర్యాలీని జయప్రదం చేయాలి: సీపీఎం



ఎండ్రాయిలో ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

అమరావతి: బీజేపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న ఢిల్లీలో నిర్వహించనున్న కార్మిక, కర్షక ర్యాలీని జయప్రదం చేయాలని సీపీఎం నాయకులు కోరారు. మండలంలోని ఎండ్రాయిలో ఆదివారం పల్నాడు జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి అనుముల లక్ష్మీశ్వరరెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి బి. సూరిబాబు తదితరులు ఇంటింటికీ కరపత్రాలు పంచి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాల వల్ల వ్యవసాయం తీవ్రమైన సంక్షోభంలో కూరుకుపోయిందని తెలిపారు. ఉపాధి హామీ పథకానికి రూ. 30వేల కోట్ల కేటాయింపులు తగ్గించడం వల్ల దేశవ్యాప్తంగా వలసలు పెరిగే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాల్ని నిరసిస్తూ ఏప్రిల్ 5న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా నిర్వహించే ర్యాలీని విజయవంతం చేయడానికి దేశవ్యాప్తంగా ప్రజలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాంగాన్ని ఆవిష్కరించిన మంత్రి అంబటి

రాజుపాలెం: ఆశ్రమానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మండలంలోని కొండమోడు సమీపంలో గల శ్రీముచికుంద మహర్షి ఆశ్రమ 43వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆశ్రమ ఆస్థాన సిద్ధాంతి బ్రహ్మశ్రీ చల్లా శ్రీనివాసశర్మ రచించిన శ్రీశోభకృత నామ సంవత్సర పంచాంగాన్ని రాష్ట్ర మంత్రి అంబటి ఆవిష్కరించారు. అనంతరం సూర్య సిద్ధాంతి బ్రహ్మశ్రీ లంకా శ్యాంసుందరశర్మను, బ్రహ్మశ్రీలు బట్టిప్రోలు తుకారాంశర్మ, కప్పగంత సుబ్బరాయ సోమయాజులు, అద్దేపల్లి రమణ సిద్ధాంతి మొదలగు వారిని రాష్ట్ర మంత్రి అంబటి, ఆశ్రమ ట్రస్ట్ చైర్మన్ తోట మోహన్‌రావులు కలిసి ఘనంగా సన్మానించారు. ముందుగా ఆశ్రమంలో భక్తులు 54 గాయత్రీ హోమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, సత్తెనపల్లి మండల కన్వీనర్ రాయపాటి పురుషోత్తం, రాజుపాలెం సర్పంచ్ పులిబండ్ల అశోక్, నవోదయ స్కూల్ డైరెక్టర్ ప్రత్తి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ పునః ప్రతిష్ట మహోత్సవం



ప్రతిష్ఠా మహోత్సవం అనంతరం భక్తులకు దర్శనం ఇస్తున్న ఉత్సవమూర్తులు

పెదకూరపాడు: మండలంలోని 75 త్యాళ్లూరులో వైభవంగా ఆదివారం సీతారామచంద్రస్వామి దేవాలయం పునఃప్రతిష్ట మహోత్సవం నిర్వహించారు. వేదమంత్ర సహిత రామనామంతో ఉదయం 9.05 నిమిషాల సుముహూర్తంలో రత్నాలు, యంత్రాలు, విగ్రహ స్థాపన చేశారు.అలంకరణ అనంతరం గోవుతో దునుదర్శనం, కుంభ దర్శనం, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ, పూర్ణాహుతి హోమం నిర్వహించారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, వసంతకుమారి దంపతులు స్వామిని ప్రత్యేక పూజలు చేశారు. ధర్మకర్తలు వారికి దుశ్శాలువా , జ్ఞాపికను అందజేశారు. ఆలయ అర్చకులు పరుచూరి శ్రీనివాసాచార్యులు, శ్రీపతి బాలకృష్ణ, నరహరి ఆచార్య బృందం శాంతి కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గుత్తికొండ ఆంజిరెడ్డి, ఈదా సాంబిరెడ్డి, కల్లి శ్రీనివాసరెడ్డి, అనువంశ ధర్మకర్తలు చిర్రా రాజశేఖర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. పెదకూరపాడు ఎస్ఐ వెంకట కృష్ణారావు ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్త్ నిర్వహించారు.

రబీ సీజన్‌కు పుష్కలంగా ఎరువులు



రైతుభరోసా కేంద్రానికి దిగుమతి చేస్తున్న ఎరువులు

నకరికల్లు: రబీసీజన్‌లో ఎరువుల కోసం రైతులు ఆందోళనా చెందాల్సిన అవసరం లేదని పుష్కలంగా ఎరువులు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు తెలిపారు. మండలంలోని పలు రైతుభరోసా కేంద్రాలకు ఆదివారం ఎరువులు దిగుమతి అయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుంకలగుంట-1లోని రైతుభరోసా కేంద్రంలో డీఏపి 10టన్నులు, ఎంటపి 6టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 6టన్నులు, కుంకలగుంట-2లోని రైతుభరోసాకేంద్రంలో యూరియా 15టన్నులు, డీఏపి 5 టన్నులు, దేచవరం గ్రామంలోని రైతుభరోసాకేంద్రంలో 20టన్నుల యూరియా అందుబాటులోకి వచ్చిందన్నారు. మరో 100టన్నుల యూరియా సోమవారం దిగుమతి చేసుకోనున్నట్లు తెలిపారు. రైతులు సూచనల మేరకు ఎరువులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలను దగ్ధం చేసిన దుండగులు

నరసరావుపేట టౌన్: ఇంటి ముందు నిలిపిన వాహనాలను గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు అంటించిన సంఘటన ఆదివారం వెలుగు చూసింది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోటప్పకొండ రోడ్డు సాంబశివరావుపేటలో నివాసం ఉంటున్న షేక్ చాంద్‌బాష రోజూ మాదిరిగానే తన ద్విచక్రవాహనాన్ని శనివారం రాత్రి ఇంటి ముందు నిలిపాడు. ఆదివారం ఉదయం లేచి చూసేసరికి వాహనం దగ్ధమై కనిపించింది. అదే విధంగా పక్క వీధిలో ఇంటి ఎదుట పార్క్ చేసిఉన్న పసుపులేటి చంద్రశేఖర్‌కు చెందిన వాహనానికి దుండగులు నిప్పు అంటించారు. సమాచారం అందుకున్న సీఐ వీరేంద్రబాబు సంఘటనా స్థలానికి చేరుకొని దగ్ధమైన రెండు ద్విచక్రవాహనాలను పరిశీలించారు. సమీపంలోని సీసీ పుటేజీలో నిక్షిప్తమై ఉన్న వీడియోను పరిశీలించి అనుమానితులను గుర్తించారు. ఈ మేరకు బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానము
దేవరంపాడు(గ్రా), రాజుపాలెం(మం), పల్నాడు జిల్లా.
D.Dis.No.A4/13089/07/126/2023 Dt.27.01.2023
e-Procurement Tender
దేవస్థానము వద్ద మెట్ల నిర్మాణము చేయు నిమిత్తం e-Procurement ద్వారా టెండర్లు కోరబడినవి. వివరములకు https://tender.apeprocurement.gov.in వెబ్‌సైట్‌లో చూడగలరు.
సం/- కార్యనిర్వహణాధికారి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(సత్తెనపల్లి, పెదకూరపాడు)
99516 02950
Office mail : sakshigntadvt@gmail.com